క్లుప్తంగా

తహసీల్దార్‌కు సన్మానం



వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలానికి బదిలీపై వచ్చిన తహసీల్దార్ బి రాజును కార్యాలయంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్, నాయకులు కుమ్మరి గోవిందు, రామచందర్, బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు డి శ్రీనివాసులు, గుడిసె ధర్మ, జి ఎల్లస్వామి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు సొప్పరి రమేష్, రామరాజు, రవి, కుర్మయ్య, బహుజన రమేష్, సూరి, శ్రీరాములు, రమేష్ రాముడు, విష్ణు, బీఎస్పీ నాయకులు రాము, బీసన్న, జి వికాస్, జి చరణ్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో అనేక ప్రయోజనాలు



గోపాల్‌పేట: ప్రతిరోజు యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండటంతో పాటు ఆయుష్షు పెంచుకునే అవకాశం ఉందని యోగా శిక్షకుడు శ్రీనునాయక్ అన్నారు. గురువారం రేవల్లి మండలంలోని గౌరిదేవిపల్లిలో పతాంజలి యువ ప్రభారి ఆధ్వర్యంలో యోగాశిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతిరోజు యోగా చేస్తే ఎన్నో లాభాలుంటాయని వివరించారు.

కుక్క దాడి.. వ్యక్తికి గాయం

వీపనగండ్ల: మండల కేంద్రంలో ఇటీవల ఓ చిన్నారిని గాయపరిచిన కుక్క గురువారం కూడా మరో వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరచింది. మండల కేంద్రానికి చెందిన హరిజన్ ఖాసీం నడుచుకుంటూ వెళ్తుండగా దళితవాడలో ఉన్న వీధి కుక్క అకస్మాత్తుగా దాడి చేసింది. బాధితుడిని స్థానిక ఆసుపత్రిలో చేరి్పించి ప్రథమ చికిత్స చేయించి మెరుగైన చికిత్స కోసం వనపర్తి ఆసుపత్రికి తరలించారు. కుక్కను బంధించాలని గ్రామప్రజలు పంచాయతీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



పాన్‌గల్: మండలంలోని కొత్తపేటలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం కాంగ్రెస్ నాయకులు కిరణ్‌సాగర్, తిరుమల్‌యాదవ్‌లు లబ్ధిదారులకు అందజేశారు. గ్రామానికి చెందిన గునమోని ఆంజనేయులుకు రూ.17,500, సుశీలమ్మకు రూ.57 వేల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లికి, మండల కాంగ్రెస్ నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కురుమూర్తి, శ్రీను, కర్ణాకర్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, పాల్గొన్నారు.

టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్ జాం



అలంపూర్: రాష్ట్ర సరిహద్దులోని పుల్లూరు టోల్‌గేట్ వద్ద భారీగా వాహనాలు నిలిచిపోయాయి. గురువారం పుల్లూరు టోల్‌గేట్ వద్ద సాఫ్ట్‌వేర్ సమస్య తలెత్తడంతో 12 టోల్ కౌంటర్లలో 6 కౌంటర్లను సిబ్బంది మూసేశారు. రెండు గంటలపాటు సాఫ్ట్‌వేర్ పనిచేయకపోవడంతో కర్నూలు, హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు కిలోమీటర్ మేర నిలిచిపోయాయి. వాహనాలు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడినట్లు వాహనదారులు వాపోయారు.

చేప పిల్లల ఉత్పత్తికి చెరువుల పరిశీలన

గట్టు: చేప పిల్లల పెంపకానికి సంబంధించి చెరువుల్లో కొత్తగా ఏర్పాటు చేసే చిన్నపాటి ఫిష్ పాండ్‌కు సంబంధించిన స్థలాలను గురువారం జిల్లా అధికారులు పరిశీలించారు. గట్టులోని పెద్ద చెరువు, రాయాపురంలోని చిన్నకుంట, శేషమ్మకుంట, ఆలూరు, వాయిల్‌కుంట తండాల్లోని చెరువులు పరిశీలించారు. నోటిఫైడ్ చెరువుల్లో ప్రభుత్వం చేప పిల్లల పెంపకానికి సంబంధించి చెరువుల్లోకి నీరు వచ్చే చోట కొత్తగా ఫిష్ పాండ్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు డీటీసీ విద్యాధర్ తెలిపారు. ఫిష్ పాండ్‌ల్లోనే చేప పిల్లలను పెంచి, వాటిని ఆయా చెరువుల్లో వదిలేందుకు అనుకూలంగా నోటిఫైడ్ చెరువుల్లో కొత్తగా ఫిష్ పాండ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి డీటీసీ (జిల్లా టెక్నికల్ సెల్) అధికారి విద్యాధర్, ఈసీ రామకృష్ణ పాల్గొన్నారు.

బారులుతీరిన ధాన్యం వాహనాలు



వీపనగండ్ల గోదాం వద్ద నిలిచిన వరిధాన్యం వాహనాలు

- భోజనం లేదని అలిగిన హమాలీలు
- ఆందోళన చెందుతున్న రైతులు

వీపనగండ్ల: మండల కేంద్రంలో 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంలో ధాన్యం నిలువ చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన లారీలు గురువారం రోడ్డుపైనే బారులు తీరాయి. మధ్యాహ్నం భోజనం పెట్టలేదనే సాకుతో ధాన్యం దించే హమాలీలు ఉన్నపలంగా వెళ్లిపోవడంతో దాదాపు 60 ధాన్యం వాహనాలు రోడ్డుపైనే నిలిచాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ధాన్యం పాడవుతుందని ఆందోళనతో రైతులు బిక్కుబిక్కుమంటూ కాలాన్ని వెళ్లదీస్తున్నారు. మండలంలోని కల్వరాల, తూంకుంట, సంగినేనిపల్లి తదితర గ్రామాలలోని మండల మహిళా సమాఖ్య, తూంకుంట సింగిల్ విండో కొనుగోలు కేంద్రాల ద్వారా పలువురు రైతులు వరి ధాన్యం తూకం వేయించి లారీల్లో వీపనగండ్ల సమీపంలోని గోదాంకు తరలించారు. తీరా గోదాం దగ్గరికి వచ్చాక హమాలీలు అలిగి వెళ్లడంతో రైతులు తీవ్ర నిరాశకు గురై తమ సమస్యకు పరిష్కారం చూపేవారే లేరా? అని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి గోదాం వద్ద ఉన్నత స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించి చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



బురదమయంగా మారిన గోదాంకు వెళ్లే దారి

మా గోడు పట్టించుకునే వారు లేరు



వివిధ ప్రాంతాల నుంచి లారీల ద్వారా ధాన్యాన్ని తీసుకొని గోదాంకు వస్తే చిన్నచిన్న సమస్యలతో ధాన్యం దింపడం లేదు. మారుమూల మండలం కావడంతో మాకు కనీసం భోజన వసతి కూడా లేదు. రాత్రింబవళ్లు లారీల వద్దే జాగారం చేయాల్సి వస్తోంది.

– షబ్బీర్, లారీ డ్రైవర్, జడ్చర్ల

సమస్యలు రాకుండా చూస్తాం..

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన హమాలీలకు రైస్‌మిల్ యజమాని మధ్యాహ్నం వరకు పని చేసి తిరిగి రావాలని ఆదేశించడం వల్లే వాళ్లు ధాన్యం దించకుండా వెళ్లిపోయారు. గోదాం వద్ద నిల్వ ఉన్న వాహనాలు వివిధ ప్రాంతాల నుంచి వచ్చినవి. రైస్ మిల్ యజమానులతో మాట్లాడి రైతులకు లారీ యజమానులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తాం.

– వరలక్ష్మి, తహసీల్దార్, వీపనగండ్ల

మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యం సరికాదు



పాతపల్లి దగ్గర మొక్కలు నాటుతున్న డీఆర్డీఓ ఉమాదేవి

వనపర్తి రూరల్: మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని డీఆర్డీఓ ఉమాదేవి హెచ్చరించారు. గురువారం పెబ్బేరు మండలం పాతపల్లిలోని వన నర్సరీని ఎంపీడీఓ రవీందర్‌తో కలిసి పరిశీలించారు. వర్షాలు కురుస్తుండటంతో కొల్లాపూర్ రహదారికి ఇరువైపులా అయ్యవారిపల్లి వరకు తీసిన గుంతల్లో మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం మాట్లాడుతూ.. గతంలో నాటిన మొక్కల చుట్టూ చెత్తాచెదారాన్ని తొలగించాలని పంచాయతీ కార్యదర్శి, ఎఫ్ఏ, గ్రామస్తులకు సూచించారు. ఆమె వెంట ఎంపీఓ రోజ, ఇన్‌చార్జ్ ఏపీఓ నర్సింహారెడ్డి, లక్ష్మి, కార్యదర్శి డేగారెడ్డి, ఎఫ్ఏ హుస్సేన్, మాజీ సర్పంచ్ రవీందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతుల వివరాలు నమోదు చేసుకోవాలి



పాన్‌గల్ రైతు వేదికలో రైతుల వివరాలను నమోదు చేస్తున్న ఏఈఓలు

పాన్‌గల్: విశిష్ట సంఖ్య కోసం రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఏఓ రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీపై అవగాహన కల్పించి పలువురి వివరాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడారు. రైతులకు విశిష్ట సంఖ్య కేటాయించే ప్రక్రియలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రైతుల భూముల వివరాలను నమోదు చేస్తుందన్నారు. ఆధార్ కార్డు జిరాక్స్, పట్టదారు పాసు పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డుకు అనుసంధానమైన ఫోన్ నంబర్‌తో ఏఈఓలను సంప్రదిస్తే వివరాలను నమోదు చేస్తారన్నారు.

ఇంటికే పౌష్టికాహారం



చిట్యాలలో లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

- అంగన్‌వాడీ లబ్ధిదారులకు ప్రయోజనం
- సెలవుల్లో కూడా పోషకాహారం పంపిణీ

వనపర్తి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మే లో అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించింది. లబ్ధిదారులకు నష్టం కలగకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం వారానికి ఒకసారి నేరుగా పౌష్టికాహారం అందించే విధానం అమల్లోకి తెచ్చింది. లబ్ధిదారుల ఇళ్లను సందర్శించి, సర్వే చేయాలని ఆదేశించారు.

టీహెచ్‌ఆర్ అమలు..
రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు మే నెలలో టేక్ హోం రేషన్ (టీహెచ్‌ఆర్) అమలు చేసింది. మొదటి 15 రోజులు టీచర్, తర్వాత 15 రోజులు ఆయాలు సెలవులు తీసుకుంటారు. విధుల్లో ఉండే రోజుల్లో సిబ్బంది కేంద్రాలు తెరిచి లబ్ధిదారులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. ఆరేళ్లలోపు చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు బియ్యం, పప్పు, నూనె, గుడ్లు, పాల పాకెట్లు, బాలామృతం అందిస్తున్నారు. పూర్వ ప్రాథమిక విద్యార్థులకు సెలవులు వర్తిస్తాయి. విధుల్లో ఉన్న సిబ్బంది టీహెచ్‌ఆర్ పంపిణీ అనంతరం ఇంటి సర్వే నిర్వహించి పూర్వ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులను చేర్పించడం, పిల్లల ఎత్తు, బరువు చూడటం, బడీడు పిల్లలను గుర్తించడం వంటి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఈ కొత్త విధానం లబ్ధిదారులకు నిరంతర ఆహార సరఫరాకు దోహదపడనుంది.

ప్రత్యేక దృష్టి



అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అంగన్‌వాడీ సిబ్బందికి సెలవులున్నా కేంద్రాలు తెరిచే ఉంటాయి. అంగన్‌వాడీ టీచర్, హెల్పర్‌లో ఎవరైనా ఒక్కరు కేంద్రంలో అందుబాటులో ఉంటారు. కేంద్రాల్లో వంట చేయకుండా లబ్ధిదారులకు సరుకులు అందిస్తున్నాం.

– హజీరాబేగం, సీడీపీఓ ఇన్‌చార్జ్, వనపర్తి

జిల్లాలో ఇలా..

అంగన్‌వాడీ కేంద్రాలు 589	గర్భిణులు: 2,255
	బాలింతలు: 1,714
చిన్నారులు: 20,824	

రైతులు, కార్మికులను మోసం చేస్తున్న కేంద్రం



ఆత్మకూర్: దేశంలోని రైతులను, కార్మికులను కేంద్ర ప్రభుత్వం మోసం చేస్తోందని, దేశ ప్రజలందరు తిరగబడాల్సిన సమయం వచ్చిందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి నరేందర్‌ప్రసాద్ అన్నారు. గురువారం ఆత్మకూర్‌లో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కు తీసుకుంటున్నామని చెప్పి రెండేళ్లు గడుస్తున్నా, వంటిద్దు పోకడలకు పోతున్నారని ధ్వజమెత్తారు. నాలుగు కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి కార్మిక లోకానికి తీరని అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు రాబర్ట్, మశప్ప, తదితరులు ఉన్నారు.

ఆలయాల నిర్మాణానికి విరాళం

ఆత్మకూర్: ఆత్మకూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న పోశమ్మ, కర్రెమ్మ, లింగమయ్య, కోటమైసమ్మ, కట్టమైసమ్మ, భూలక్ష్మమ్మ ఆలయాలు, బొడ్రాళ్ల నిర్మాణానికి భక్తులు పెద్ద ఎత్తున విరాళాలు అందిస్తున్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పరమేష్ రూ.50 వేలు, నల్గొండ శ్రీనివాసులు రూ.50 వేలు, తులసీరాజ్ యాదవ్ రూ.50 వేలు, రహ్మతుల్లా రూ.ఒక లక్ష నగదును నిర్వాహకులకు అందజేశారు.

జూన్ 3 నుంచి ప్రతిష్ఠ మహోత్సవాలు
పోశమ్మ, కర్రెమ్మ, లింగమయ్య, కోటమైసమ్మ, కట్టమైసమ్మ, భూలక్ష్మమ్మ ఆలయాలు, , బొడ్రాళ్ల ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాల సందర్భంగా ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు గురువారం సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్‌లకు నిర్వాహకులు ఆహ్వానపత్రికలు అందజేశారు. జూన్ 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నూతన ఆలయాల ప్రారంభోత్సవాలు, గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు డాక్టర్ మొగిలి శ్రీధర్‌గౌడ్, నిర్వాహకులు అశ్విన్‌కుమార్, ఆనంద్, కొండాపురం రాము, మణివర్ధన్‌రెడ్డి, ఎస్టీడీ శ్రీను, శివానంద్, రమాకాంత్, నాగేష్, వెంకటేష్, యాదగిరిశెట్టి, బాలకృష్ణ, రఘు, సూరి, అశోక్, కృష్ణయ్య, రవీందర్, రాము తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తన విక్రయాలపై ఉక్కుపాదం



నాగల్‌కడ్మూర్‌లో రైతులకు సూచనలు ఇస్తున్న సీఐ శివకుమార్



పాన్‌గల్‌లో తనిఖీ చేస్తున్న ఏడీఏ చంద్రశేఖర్, ఎస్ఐ శ్రీనివాసులు

- రైతులకు అవగాహన కల్పించిన సీఐ శివకుమార్
- విత్తన దుకాణాల్లో విస్తృతంగా తనిఖీ

అమరచింత: నకిలీ విత్తనాల కొనుగోలు చేయకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ శివకుమార్ అన్నారు. మండలంలోని నాగల్‌కడ్మూర్ శివారులోని పంటపొలాల్లో వ్యవసాయ పనులు చేస్తున్న రైతులను కలిసి పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మార్కెట్‌లో నకిలీ విత్తనాలు గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తూ రైతులను మోసం చేసే దుండగులు అధికమవుతున్నారని, అలాంటి వారిపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన పత్తి విత్తనాలనే కొనుగోలు చేసి విత్తుకోవాలని సూచించారు. లైసెన్స్ ఉన్న ఫర్టిలైజర్ షాపుల ద్వారా పత్తితో పాటు వివిధ రకాల విత్తనాలు కొనుగోలు చేస్తే భవిష్యత్‌లో ఎలాంటి నష్టం కలిగిన సంబంధిత కంపెనీ ద్వారా పంట నష్ట పరిహారం చట్టపరంగా పొందే అవకాశం ఉందన్నారు. ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అమ్మితే చర్యలు
రైతులకు నకిలీ పత్తి విత్తనాలు అమ్మితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సురేష్ అన్నారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ చేశారు. వర్షాకాల పంటల సాగు సమయం మొదలవ్వడంతో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని, సదరు ఫర్టిలైజర్ షాపుల యాజమానులకు సూచించారు. కాలం చెల్లిన ఎరువులు, మందులు షాపుల్లో కనిపిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

ఆత్మకూర్: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని, విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని ఎస్ఐ నరేందర్, మండల వ్యవసాయశాఖ అధికారి వినయ్‌కుమార్ అన్నారు. నకిలీ విత్తనాల నియంత్రణలో భాగంగా టాస్క్‌ఫోర్స్ బృందం గురువారం ఆత్మకూర్‌లోని విత్తన, ఫర్టిలైజర్స్ షాపుల్లో ఆకస్మిక తనిఖీ ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా విత్తనాల నిల్వలు, వాటి కంపెనీలు, ఎక్స్‌పైరీ తేదీలను, లైసెన్సులను, స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. రైతులకు నాణ్యత కలిగిన విత్తనాలనే విక్రయించాలని, బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని, విక్రయాల విషయంలో పూర్తి స్థాయిలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ ఏఈఓలు మహేష్, ఝాన్సీ, సంతోష్ ఉన్నారు.

తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలి
పాన్‌గల్: ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులను కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదులు అందించాలని ఏడీఏ చంద్రశేఖర్ డీలర్లకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను ఎస్ఐ శ్రీనివాసులు, ఏఓ రాజవర్ధన్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. రైతులను మోసం చేస్తే డీలర్లపై చర్యలు తప్పవన్నారు.

గిరిజనుల పట్టాలపై జాతీయ ఎస్టీ కమిషన్ చర్యలు



కలెక్టర్‌కు జాతీయ ఎస్టీ కమిషన్ పంపిన నోటీసు

ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడ, షాపురం గ్రామాల రెవెన్యూ శివారులో గిరిజనులు సాగు చేసుకుంటున్న జాగిర్దార్ భూములకు పట్టాల విషయమై జాతీయ ఎస్టీ కమిషన్ చర్యలు చేపట్టడం జరిగిందని బీజేపీ జిల్లా ఎస్టీమోర్చా అధ్యక్షులు రవి నాయక్ గురువారం తెలిపారు. ఈ విషయమై విలేకర్లతో ఆయన పలు విషయాలు వెల్లడించారు. రెండు గ్రామాల రెవెన్యూ శివారుల్లోని 8 తండాల గిరిజనులు ఐదు తరాలుగా సాగు చేస్తున్నా, పట్టాలు రాలేదని తెలిసిన వెంటనే బీజేపీ రాష్ట్ర ఎస్టీమోర్చా అధ్యక్షులు కల్యాణ్ నాయక్ స్వయంగా వచ్చి భూములను పరిశీలించి గిరిజనలుతో మాట్లాడినట్లు తెలిపారు. ఈ విషయమై ఏప్రిల్ 3న జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో జాతీయ ఎస్టీ కమిషన్ గిరిజనుల పట్టాల విషయమై గురువారం వనపర్తి జిల్లా కలెక్టర్‌కు నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. భూములను పరిశీలించి వివరాలు 30 రోజుల్లో వెల్లడించాలని కోరినట్లు తెలిపారు. త్వరలోనే అధికారులు గిరిజనులు సాగు చేస్తున్న భూములను పరిశీలించి నివేదికను పంపడం జరుగుతుందన్నారు. ఇక నుంచి గిరిజనులకు మంచి జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలు



ఆత్మకూర్‌లోని కిరాణషాపులో ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న కమిషనర్ శశీధర్

ఆత్మకూర్: ప్లాస్టిక్ వినియోగం వల్ల అనర్థాలు జరుగుతాయని, ప్లాస్టిక్ వాడకం, అమ్మకం మానుకోవాలని పురపాలిక కమిషనర్ చికినే శశిధర్ అన్నారు. గురువారం స్థానిక దుకాణాల్లో ముమ్మరంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధివినాయక కిరాణషాపులో 120 ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని రూ.2 వేల జరిమానా విధించారు. ప్లాస్టిక్ వాడిన, అమ్మిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వార్డు అధికారులు, పురపాలిక సిబ్బంది ఉన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా



శ్రీరంగాపురంలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

వనపర్తి రూరల్: నెలరోజులు గడుస్తున్నా కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కదలడం లేదని గురువారం బీజేపీ అధ్యక్షులు ఎస్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో శ్రీరంగాపురం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి రాజును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా నాయకులు మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యం పరిశీలించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పెద్దిరాజు, వెంకట్రామరెడ్డి, రాములు, శివ, ఎల్లస్వామి పాల్గొన్నారు.

దంచికొడుతున్న వానలు

- రోడ్లన్నీ గుంతల మయం
- ప్రమాదాల బారిన ప్రయాణికులు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆత్మకూర్: వర్షం బీభత్సం సృష్టిస్తోంది. ఐదు రోజులుగా వర్షాలు దంచికొడుతుండడంతో రోడ్లన్నీ జలమయంగా మారి గుంతలు ఏర్పతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికి తోడు విద్యుత్ సరఫరా కాకపోవడంతో స్థానికులు విద్యుత్ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. గాంధీచౌక్‌లో వర్షం నీరు భారీగా చేరడంతో పలు వాహనదారులు డ్రైయినేజీలో పడి గాయాలపాలయ్యారు. సీసీరోడ్ల నిర్మాణపనులు పూర్తిస్థాయిలో చేయకపోవడం, గాంధీచౌక్‌లో డ్రైయినేజీ వద్ద కల్వర్టు నిర్మించకపోవడంతో నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. గుంతల మయమైన రోడ్లను బాగు చేయాలని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



ఆత్మకూర్‌లోని గాంధీచౌక్‌లో రోడ్డు



ఆత్మకూర్‌లో బస్టాండ్ రోడ్డు



ఆత్మకూర్‌లోని అమరచింతవైపు రోడ్డు